క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: పెనమలూరు సెక్షన్ పరిధిలోని గంగూరు గ్రామంలో విద్యుత్ సరఫరాకు మంగళవారం అంతరాయం కలుగుతుందని ఈఈ ఆపరేషన్స్ పి.హరిబాబు తెలిపారు. ఈ మేరకు సోమవారం వివరాలు తెలుపుతూ మంగళవారం గంగూరులో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామన్నారు. గ్రామస్తులు గమనించి విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలి



గన్నవరం: ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నిబంధనలను పాటించాలని గన్నవరం ఆర్టీసీ డిపో మేనేజర్ పి.శివాజీ సూచించారు. రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని సోమవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ నుంచి పోలీస్‌స్టేషన్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ.. రోడ్డు భద్రతా నియమాలు పాటించడం ద్వారా సురక్షితంగా గమ్యస్థానాలను చేరవచ్చని తెలిపారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనాలను నడపడం ప్రమాదకరమన్నారు. ముందు వెళ్లే వాహనానికి సమ దూరం పాటించాలని, జీబ్రా లైన్ల పైన మాత్రమే రోడ్డు దాటాలని సూచించారు. ర్యాలీలో డిపో సూపర్‌వైజర్లు మధు, అంబారావు, సురేష్, అసోసియేషన్ నాయకులు ఎం డీ.ప్రసాద్, రత్నాకర్, నాగరెడ్డి, ఏఎస్.రావు, తిరుమలరావు, 70 మంది ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

కబడ్డీ జట్టుకు అభినందన




పెనమలూరు: గంగూరు ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీ కబడ్డీ జట్టు పోటీల్లో గెలిచింది. ఈ నెల 9న ఒంగోలులో జరిగిన క్విస్ ఫెస్ట్ - 2024 కబడ్డీ పోటీల్లో 26 జట్లు పాల్గొన్నాయి. ఈ పోటీల్లో ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపటంతో ద్వితీయ స్థానంలో నిలిచారు. జట్టు సభ్యులు ఎ.సాయి కృష్ణ, బి.యశ్వంత్, షేక్.షమీర్, షేక్.జాన్‌సైదా, ఎస్.రవికుమార్, డి.శ్రీనివాస్, నాగచరణ్‌తేజ, సిద్ధాంత్‌కుమార్‌నాయక్, టి.నాగార్జున, షేక్.రెహమాన్, కె.శివరామకృష్ణలను కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కడియాల రవి, పీడీ కె.సత్యనారాయణరావు అభినందించారు.

జడ్జి మృతికి నివాళి



గన్నవరం: స్థానిక అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన పూర్వపు జడ్జి డి.షర్మిల సంతాప కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఆమె చిత్రపటానికి బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు తిరివీధి వెంకయ్య, జాస్తి తాతారావు, పలువురు సీనియర్ న్యాయవాదులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గతంలో గన్నవరం ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జిగా పనిచేసిన షర్మిల అకాల మరణం బాధకరమని పలువురు న్యాయవాదులు పేర్కొన్నారు. జడ్జిగా ఆమె ఇచ్చిన తీర్పులు, న్యాయపరమైన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు కలపాల వెంకటరమణ, తాళపర్తి వెంకట్రావు, అమర్తల సోమేశ్వరరావు, నీరజ, సీనియర్ న్యాయవాదులు మరీదు తంబీ, ప్రకాష్ పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ పునఃప్రతిష్ఠ



ఉయ్యూరు: ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంత జీవనం అలవడుతుందని దత్తపీఠం ఉత్తరాధికారి శ్రీదత్తవిజయానంద స్వామి అన్నారు. మండలంలోని గండిగుంట శ్రీ గణపతి సచ్చిదానంద ఆశ్రమంలో శ్రీ కార్యసిద్ధి ఆంజనేయస్వామి విగ్రహ పునఃప్రతిష్ఠ సోమవారం వైభవంగా నిర్వహించారు. దత్తపీఠం ఉత్తరాధికారి శ్రీదత్త విజయానంద స్వామి శ్రీచక్ర పూజ, ప్రతిష్ఠా హోమం, పూర్ణాహుతి నిర్వహించి శాస్త్రోక్తంగా కార్యసిద్ధి ఆంజనేయ స్వామి విగ్రహాన్ని పునఃప్రతిష్ఠించారు. స్వామి వారికి అభిషేకం, పూజా కార్యక్రమాలు జరిపించారు. భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. హనుమాన్ చాలీసా పారాయణం నిత్యం పఠించాలన్నారు. మేనేజింగ్ ట్రస్టీ మంజుల, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే జగనన్న లక్ష్యం

రాష్ట్ర మంత్రి జోగి రమేష్



పోరంకిలో డ్వాక్రా మహిళలకు చెక్కు అందజేస్తున్న మంత్రి జోగి రమేష్, అధికారులు

పెనమలూరు: రాష్ట్రంలో మహిళల ఆర్థికాభివృద్ధే సీఎం జగనన్న లక్ష్యమని గృహనిర్మాణ శాఖ మంత్రి, పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త జోగి రమేష్ అన్నారు. వైఎస్సార్ ఆసరా నాల్గవ విడత చెక్కుల పంపిణీ కార్యక్రమంలో భాగంగా తాడిగడప మున్సిపాలిటీ పోరంకిలో సోమవారం జరిగిన కార్యక్రమంలో మంత్రి జోగి రమేష్ పాల్గొని ప్రసంగించారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా, ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా మహిళలకు అండగా జగనన్న నిలిచారన్నారు. డ్వాక్రా అక్కా చెల్లెమ్మలకు ఆసరా, పిల్లలు చదివించటానికి అమ్మ ఒడి, 45 ఏళ్ల నిండిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, అగ్రవర్ణాల మహిళలకు నేరుగా బ్యాంకులో సొమ్ము జమ చేసి ఆర్థికంగా ఆదుకున్నారని చెప్పారు. ఫ్యామిలీ డాక్టర్, ఆరోగ్య సురక్ష, ఆరోగ్యశ్రీ పథకంతో పరిమితిని రూ.25 లక్షలకు పెంచారని తెలిపారు.ఎన్నో విప్లవాత్మక మార్పులను తీసుకువచ్చారని చెప్పారు. జగనన్న ఇప్పటికి 124 సార్లు బటన్ నొక్కి అన్ని వర్గాల వారికి ఆర్థిక సాయం అందించారని అన్నారు. సంక్షేమ పథకాలు పొందుతున్న లబ్ధిదారులు కూడా రెండు బటన్లు నొక్కి(ఎంపీ, ఎమ్మెల్యే) జగనన్నకు ఓటు వేయాలని కోరారు.

తోడు దొంగలు వస్తున్నారు జాగ్రత్త..

రాష్ట్రంలో ఇద్దరు తోడు దొంగలు వస్తున్నారని ప్రజలు వారి పట్ల చాలా జాగ్రత్తగా ఉండాలని మంత్రి జోగి రమేష్ అన్నారు. చంద్రబాబు, దత్త పుత్రుడు పవన్‌కల్యాణ్‌లు వచ్చి కల్లబొల్లి మాటలు చెబుతారని ఆరోపించారు. గత టీడీపీ పాలనలో తోడు దొంగలు ఎన్నిసార్లు బటన్ నొక్కి పేదలకు న్యాయం చేశారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. తోడు దొంగలకు తగిన బుద్ధి చెప్పాలని కోరారు. వలంటీర్లు, సచివాలయ వ్యవస్థలను రద్దు చేస్తారని అంటున్నారని తస్మాత్ జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. పోరంకిలో 2,890 మంది డ్వాక్రా మహిళలకు రూ 2.40 కోట్లు రుణ మాఫీ చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డ్వామా పీడీ వెంకటనారాయణ, మున్సిపాలిటీ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, కేడీసీసీబీ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు పి.రాఘవరావు, బిందుమాధవి, నక్కా శ్రీనివాసరావు, ఈడే చాముండేశ్వరి, సీడీసీ చైర్మన్ రాజులపాటి రామచంద్రరావు, ఏఎంసీ డైరెక్టర్ ఆకునూరు మాణిక్యం, నాయకులు అన్నే వేణుగోపాల కృష్ణమూర్తి, దేవభక్తుని సుబ్బారావు, అర్జున్‌రెడ్డి,గమ్మడి విజయ్‌కుమార్, అద్దెపల్లి చందు, నల్లమోతు జీవన్, డ్వాక్రా మహిళలకు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జంక్షన్‌లో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు చర్యలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: హనుమాన్‌జంక్షన్ ప్రధాన రహదారుల్లో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు టెండర్లు ఖరారు కావటంతో ఈ నెల 15వ తేదీ నుంచి పనులు ప్రారంభం కానున్నాయని ఏపీ రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ కనుమూరి సుబ్బరాజు తెలిపారు. ఎన్‌హెచ్‌ఏపీ, ఏపీ ఆర్డీసీ అధికారులతో కలిసి సోమవారం ఆయన హనుమాన్‌జంక్షన్‌లో ప్రధాన రహదారులను పరిశీలించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో సుమారు 5.2 కిలోమీటర్ల మేర హనుమాన్‌జంక్షన్‌లో సెంట్రల్ లైటింగ్‌కు స్తంభాలు ఏర్పాటు చేయనున్నట్లు కనుమూరి సుబ్బరాజు చెప్పారు. ఒక్కో విద్యుత్ స్తంభం మధ్య 40 మీటర్లు దూరంలో మొత్తం 150 స్తంభాలు ఏర్పాటు చేస్తారన్నారు. అంతేకాక ప్రధాన రహదారుల్లో డ్రెయినేజీ మరమ్మతులు కూడా నిర్వహిస్తామన్నారు. త్వరితగతిన పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

వంతెన నిర్మాణం వెంటనే పూర్తి చేయండి

మంత్రి జోగి రమేష్



యనమలకుదురులో అధికారులకు సూచనలిస్తున్న మంత్రి జోగి రమేష్

పెనమలూరు: యనమలకుదురులో అసంపూర్తిగా ఉన్న వంతెన నిర్మాణం పనులు వెంటనే పూర్తి చేయాలని గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అధికారులను ఆదేశించారు. గ్రామస్తుల అభ్యర్థన మేరకు మంత్రి జోగి రమేష్ సోమవారం గ్రామంలో వంతెన వద్దకు వచ్చారు. ఈ సందర్భంగా నీటిపారుదల శాఖ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. వంతెన నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్ కోర్టుకు ఆశ్రయించటం వలన పనులకు ఆటంకం కలిగాయని తెలిపారు. దీనికి మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ.. గ్రామంలో జరగనున్న మహాశివ రాత్రి ఉత్సవాల్లో భక్తులు భారీ సంఖ్యలో పాల్గొంటారన్నారు. వంతెనకు రైలింగ్ లేకపోవటంతో భక్తులకు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని తెలిపారు. భక్తుల భద్రత దృష్ట్యా వెంటనే వంతెన పనులు చేసి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. 10 రోజుల్లో వంతెన పనులు పూర్తి చేయాలన్నారు. కాగా యనమలకుదురులో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి అంగీకరించారు. కార్యక్రమంలో తాడిగడప మున్సిపల్ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు అన్నే శ్రావణ్‌కుమార్, ఏఎంసీ చైర్‌పర్సన్ నినావత్ చిన్ని, గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ ఈడే చాముండేశ్వరి, నాయకులు దేవభక్తుని సుబ్బారావు, అన్నే వేణుగోపాలకృష్ణమూర్తి, వెలగపూడి వరప్రసాద్, గుమ్మడి విజయ్‌కుమార్, వీరబాబు, మరీదు శ్రీను, కోసూరి నరేష్, హక్, అష్రఫ్, అమీర్‌ఖాన్, సిద్దిఖ్, వినోద్, బాలకృష్ణ పాల్గొన్నారు.

హక్కుల సాధనకు ఐక్యంగా ఉద్యమించాలి



మహాసభలో మాట్లాడుతున్న ఇంటూరి ఏలియా

కంకిపాడు: హక్కుల సాధనకు ఐక్యంగా ఉద్యమించాలని ఎస్సీ, ఎస్టీ హక్కుల పోరాట సమితి వ్యవస్థాపకుడు ఇంటూరి ఏలియా పిలుపునిచ్చారు. దళిత బహుజన కులాల గర్జన మహాసభ కంకిపాడులో సోమవారం జరిగింది. ఈసందర్భంగా ఏలియా మాట్లాడుతూ.. షెడ్యూల్ కులాలకు దక్కాల్సిన సంక్షేమ పథకాలను కేంద్ర ప్రభుత్వం పక్కదారి పట్టిస్తుందని విమర్శించారు. కేంద్ర పాలకుల నిర్లక్ష్యం కారణంగా సంక్షేమం దరిచేరకుండా పోతుందన్నారు. పాలకుల నిర్లక్ష్యాన్ని తిప్పికొడుతూ, హక్కుల సాధనకు ఐక్యంగా ఉద్యమించాలని విజ్ఞప్తి చేశారు. దశల వారీ ఆందోళనలో ప్రతి ఒక్కరూ కలిసిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు కుంభా ప్రభుదాస్, ఉయ్యాల ఏడుకొండలు, కుంభ వెంకటేశ్వరరావు, గరికె దుర్గాప్రసాద్, కొడాలి నాగరాజు, సాలా నాగులు, లాం ప్రతాప్, టెక్కెం ఆదిశేషులు, జగన్నాథ శ్రీనివాసరావు, గరికె వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మంతెన సొసైటీ చైర్మన్‌గా ఆదినారాయణ

కంకిపాడు: మంతెన పీఏసీఎస్ చైర్మన్‌గా గోగం ఆదినారాయణ స్థానిక సంఘ కార్యాలయంలో సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సొసైటీ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. రైతు ప్రతినిధులు, గ్రామస్తులు సత్కరించారు.

నేడు కంకిపాడులో వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ

కంకిపాడు: డాక్టర్ వైఎస్సార్ ఆసరా నాలుగో విడత చెక్కుల పంపిణీ కార్యక్రమం ఈనెల 13వ తేదీ మంగళవారం సాయంత్రం 4 గంటలకు కంకిపాడులో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ పి.అనూష తెలిపారు. పట్టణంలోని ఎస్‌బీఐ ఎదురుగా గల ప్రధాన రహదారిపై సభ జరుగుతుందన్నారు. కంకిపాడు, గొడవర్రు, ప్రొద్దుటూరు, మద్దూరు, కాసరనేనివారిపాలెం, ఈడుపుగల్లు గ్రామాలకు చెందిన లబ్ధిదారులు హాజరుకావాలన్నారు. కార్యక్రమానికి రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ పెనమలూరు ఇన్‌చార్జి జోగి రమేష్ పాల్గొంటారన్నారు. సభను విజయవంతం చేయాలని కోరారు.

134 మందికి వైద్య పరీక్షలు

ఉంగుటూరు: ఉషారామ ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఎన్ఏ పేటలో సోమవారం పేదలకు ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. విజయవాడకు చెందిన మ్యాక్సి విజన్ సూపర్ స్పెషాలిటీ కంటి ఆస్పత్రి వైద్య బృందంచే కంటి పరీక్షలు, అమెరికన్ ఆంకాలజీ ఇనిస్టిట్యూట్ సౌజన్యంతో క్యాన్సర్ పరీక్షలు చేశారు. ఈ శిబిరంలో 134 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి కళ్ల అద్దాలు, మందులు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నాగరాజు, డాక్టర్లు ఎస్.తేజస్విని, శివ, శంకర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి వి.శ్రీహరిబాబు పాల్గొన్నారు.

ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు

రామవరప్పాడు: కాల్వగట్టు ప్రాంతాల్లో ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు నిర్వహించనున్నట్లు ఎనికేపాడు గ్రామ సర్పంచ్ రాచమళ్ల పూర్ణచంద్రరావు తెలిపారు. విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడు ఏలూరు మధ్య కాల్వగట్టు ప్రాంతంలో సోమవారం పంచాయతీ అధికారులతో కలిసి పూర్ణచంద్రరావు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ప్రాంతంలో మురుగునీరు పోవడానికి మార్గం లేకపోవడంతో ఈ ప్రాంతవాసులు ఇబ్బందులు పడుతున్న విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. ఈ కాల్వగట్టు ప్రాంతంలో మురుగు సమస్య పరిష్కరించే నిమిత్తం అండర్ గ్రౌండ్ పైప్‌లైన్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఏర్పాటు చేయనున్న తూముల ద్వారా మురుగునీరు నివాసాల మధ్యకు వెళ్లకుండా ప్రధాన డ్రెయిన్‌లో కలుస్తాయని చెప్పారు. అలాగే ఈ ప్రాంతంలో సురక్షిత తాగునీరు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, స్థానిక వార్డు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

క్రీడలకు ప్రభుత్వం ప్రాధాన్యం



జబీన్‌ను అభినందిస్తున్న మంత్రి జోగి రమేష్

ఉయ్యూరు: క్రీడలకు ప్రభుత్వం ప్రాధాన్యం కల్పిస్తోందని రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. ఖేల్ ఇండియా ఆర్ఈసీ ఓపెన్ టాలెంట్ సబ్ జూనియర్ బాలికల బాక్సింగ్ పోటీలు ఈ నెల 2 నుంచి 9వ తేదీ వరకూ బెంగళూరులో జరిగాయి. పోటీల్లో ఉయ్యూరుకు చెందిన అబ్దుల్ ఆఫియా జబీన్ 35-37 కిలోల కేటగిరిలో ఉత్తమ ప్రతిభ కనబర్చి బంగారు పతకాన్ని కైవసం చేసుకుంది. పతకం సాధించిన జబీన్‌ను సోమవారం మంత్రి జోగి రమేష్ ప్రత్యేకంగా అభినందించారు. ఆయన మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు నిర్వహించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిభావంతులైన క్రీడాకారులను వెలికితీస్తున్నారన్నారు. జబీన్ జాతీయ స్థాయిలో రాణించి ఉయ్యూరు ఖ్యాతిని ఇనుమడింప చేయాలని కోరారు. కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ రాజులపాటి రామచంద్రరావు, ప్రభుత్వాస్పత్రి చైర్మన్ జంపాన కొండలరావు, బాక్సింగ్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఉమామహేశ్వరరావు, కోచ్ సూర్య పాల్గొన్నారు.

చర్మకారుల సంక్షేమానికి కృషి

కంకిపాడు: చర్మకారుల సంక్షేమానికి కృషి చేస్తానని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ చర్మకార సేవాసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పోలిమెట్ల సురేష్‌బాబు, ముళ్లపూడి మహేష్‌లు మంత్రిని ఆయన కార్యాలయంలో కలిసి చర్మకారుల సమస్యలను వివరించారు. మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ చర్మకారుల ఉన్నతికి తోడ్పాటునందిస్తానని హామీ ఇచ్చారు.

నాలుగు రోజుల్లో బోరు ఏర్పాటు

పెనమలూరు: గంగూరు గ్రామం ఏఆర్ నగర్‌లో తాగునీటి సమస్యను పరిష్కారం చేస్తానని మంత్రి జోగి రమేష్ ఇచ్చిన హామీని నెరవేర్చారు. గ్రామంలో ఏఆర్ నగర్‌లో మంచినీటి సమస్య అధికారులు పరిష్కరించటం లేదని స్థానికులు నాలుగు రోజుల క్రితం నిరసన తెలిపారు .ఈ సమాచారం తెలుసుకున్న మంత్రి జోగి రమేష్ గంగూరు వెళ్లి పరిస్థితులు పరిశీలించి గ్రామస్తులతో మాట్లాడారు. వెంటనే రూ.6 లక్షలు నిధులు మంజూరు చేసి నాలుగు రోజుల్లోనే బోరు వేయించి మంచినీటి సమస్య పరిష్కారం చేసి సోమవారం గ్రామస్తులతో కలిసి బోరు ప్రారంభించారు. గ్రామంలో వాటర్ ట్యాంక్ నిర్మాణం, రోడ్డు, అంగన్‌వాడీ భవన నిర్మాణం చేయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అపార్టుమెంట్‌లో అగ్నిప్రమాదం



మంటలార్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

పెనమలూరు: కానూరు సనత్‌నగర్‌లో సోమవారం రాత్రి అపార్టుమెంట్‌లో అగ్నిప్రమాదం సంభవించింది. అపార్టుమెంట్ వాసులు సకాలంలో స్పందించి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వటంతో పెనుప్రమాదం తప్పింది. సనత్‌నగర్‌లో రమాసాయి అపార్టుమెంట్ ఉంది. ఇందులో నాలుగు బ్లాక్‌లు ఉన్నాయి. బ్లాక్‌కు 24 ఫ్లాట్ల చొప్పున 96 ఫ్లాట్‌లు ఉన్నాయి. అయితే 4వ బ్లాక్‌లో 4వ అంతస్తులో షేక్.హఫీజా కుటుంబ సభ్యులతో ఉంటుంది. అయితే సోమవారం రాత్రి ఇంటికి తాళం వేసి ఉన్న సమయంలో ఇంట్లో అగ్నిప్రమాదం జరిగింది. అపార్టుమెంట్ వాసులు అప్రమత్తమై అగ్నిమాపక దళానికి సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక దళం సకాలంలో వచ్చి మంటలు ఆర్పారు. అగ్నిప్రమాదంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కుటుంబ తగాదాల కారణంగా ఈ ఘటన జరిగిందని పోలీసులు భావిస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

చురుగ్గా రిజిస్ట్రేషన్ల ప్రక్రియ



ఉంగుటూరు: మండలంలో జగనన్న ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ చురుగ్గా సాగుతోంది. పలు గ్రామాల్లో జరుగుతున్న రిజిస్ట్రేషన్‌ను తహసీల్దార్ జె.వి.సుబ్బారావు పరిశీలించారు. మండల వ్యాప్తంగా 16 గ్రామ సచివాలయాల్లో 3,076 జగనన్న ఇళ్ల పట్టాలు ఉండగా 1,700 పట్టాలు రిజిస్ట్రేషన్ పూర్తి చేశారు. రిజిస్ట్రేషన్ పనుల్లో రెవెన్యూ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు నిమగ్నమయ్యారు.

టీడీపీ వికృత చేష్టలతో భయభ్రాంతులు

రామవరప్పాడు: టీడీపీ నాయకులు అవలంభిస్తున్న వికృత చేష్టలతో గ్రామస్తులు భయభ్రాంతులకు గురవుతున్నారని నిడమానూరు సర్పంచ్ శీలం రంగారావు తెలిపారు. పంచాయతీ కార్యాలయంలో సోమవారం రంగారావు విలేకరులతో మాట్లాడారు. గన్నవరం టీడీపీ ఇన్‌చార్జి యార్లగడ్డ వెంకట్రావు ఆదివారం రాత్రి గ్రామంలో నిర్వహించిన పర్యటనలో భాగంగా టీడీపీ నాయకులు శృతి మించి ప్రవర్తించారన్నారు. ఎస్సీ కాలనీలో వెంకట్రావు బ్యానర్‌కు గొర్రె తలలను దండగా వేలాడతీయడం గ్రామస్తులను భయభ్రాంతులకు గురి చేసిందన్నారు. బ్యానర్‌కు రక్తంతో తడిచిన గొర్రె తలలను చూసి గ్రామంలో క్షుద్రపూజలు ఏమైనా జరుగుతున్నాయంటూ భయాందోళనలు చెందారని చెప్పారు. సాధారణంగా గ్రామ పర్యటన కొచ్చిన నాయకులు సమస్యలు ఏమైనా ఉంటే తెలుసుకుని ప్రజలతో మమేకం అవుతారని, దీనికి విరుద్ధంగా డప్పులు కొట్టుకుంటూ ఊరేగింపు చేయడమేంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మోహన్ కోట్లాది రూపాయలు వెచ్చించి సేవా కార్యక్రమాలు నిర్వహించారని గుర్తు చేశారు. అలాగే గ్రామంలోని సచివాలయం -2, సచివాలయం-3లలో రూ.25 లక్షల సొంత నిధులతో అభివృద్ధి చేశారన్నారు. ఈ ప్రభుత్వం ద్వారా లబ్ధి, మంచి చేకూరితేనే వైఎస్సార్ సీపీకు ఓటు వేయ్యమని సీఎం జగన్ అడుగుతున్నారన్నారు. అటువంటి జగన్‌పై అవాకులు చెవాకులు పేలితే చూస్తూ ఊరుకోమని రంగారావు హెచ్చరించారు.

విద్యార్థులకు భోజనం ప్లేట్లు పంపిణీ



విద్యార్థులకు ప్లేట్లు, బాటిళ్లు అందజేస్తున్న ప్రతినిధులు

కంకిపాడు: విద్యాభివృద్ధిలో దాతల భాగస్వామ్యం అవసరమని వక్తలు పేర్కొన్నారు. మండలంలోని ఉప్పలూరు ఆర్సీఎం పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన భోజనం ప్లేట్లు, వాటర్ బాటిళ్లను వెంగళ సీతారామయ్య, రాఘవమ్మ జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు వెంగళ శివశంకర్‌రావు, సత్యనారాయణమ్మ సోమవారం పంపిణీ చేశారు. దాతలను పలువురు అభినందించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ మాజీ చైర్మన్ పడవల మధుసూదన్‌రావు, గ్రామ ఉపసర్పంచ్ బొడ్డు నాగమల్లేశ్వరరావు, బందారు మురళి, బిట్రా అశోక్, హెచ్ఎం ప్రసన్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

కంకిపాడు: పేకాట శిబిరంపై కంకిపాడు పోలీసులు సోమవారం దాడి చేశారు. ఎస్ఐ డి.సందీప్ తెలిపిన వివరాల మేరకు.. కంకిపాడు పట్టణంలోని శివారు ప్రాంతంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందటంతో ఆ ప్రాంతంపై దాడి చేశారు. దాడిలో ముగ్గురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ 1420 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. జూద శిబిరాల సమాచారాన్ని 94406 27044 నంబరుకు తెలియజేయాలని, వివరాలు తెలిపిన వారి సమాచారం గోప్యంగా ఉంచుతామని ఎస్ఐ సందీప్ తెలిపారు.

వైఎస్సార్ సీపీని వీడే ప్రసక్తే లేదు

జెడ్పీటీసీ సభ్యురాలు డాక్టర్ దుట్టా సీతారామలక్ష్మి



హనుమాన్‌జంక్షన్ రూరల్: వైఎస్సార్ కుటుంబంతో తమ అనుబంధాన్ని ఎవరూ విడదీయలేరని, తాము వైఎస్సార్ సీపీని వీడే ప్రసక్తే లేదని ఉంగుటూరు జెడ్పీటీసీ సభ్యురాలు డాక్టర్ దుట్టా సీతారామలక్ష్మి తేల్చి చెప్పారు. ఈ మేరకు ఆమె సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. పార్టీ మారుతున్నట్లు వస్తున్న ఊహాగానాలను ఆమె కొట్టిపారేశారు. దుట్టా వర్గీయులను వేరే పార్టీలో చేరమని ఎప్పుడూ ప్రోత్సాహించలేదని, ఎలా ఎప్పటికీ ప్రోత్సాహించబోమని చెప్పారు. ఒకరిద్దరూ టీడీపీలో చేరినంత మాత్రాన వైఎస్సార్ సీపీకి ఎలాంటి నష్టం లేదన్నారు. ప్రతి రాజకీయ పార్టీలోనూ అంతర్గతంగా నాయకుల మధ్య చిన్నచిన్న మనస్పర్థలు ఉండటం సహజమని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ సీఎం చేయటమే తమ లక్ష్యమని ఆమె పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ సంక్షేమ పథకాలనూ గన్నవరం నియోజకవర్గంలో ఊరూరా తిరిగి ప్రచారం చేస్తామని, ప్రతి వైఎస్సార్ సీపీ కార్యకర్తలోనూ ఆత్మవిశ్వాసం నింపుతామని తెలిపారు.

జూదరులను కోర్టుకు హాజరు పరిచిన పోలీసులు

గన్నవరం: మండలంలోని సూరంపల్లి శివారులో కోడి పందేలు నిర్వహిస్తూ పట్టుబడిన 47 మంది జూదరులను సోమవారం కోర్టులో హాజరుపరిచారు. డీఎస్పీ జయసూర్య ఆదేశాల మేరకు హనుమాన్‌జంక్షన్ సర్కిల్ పోలీసులు కోడి పందేల శిబిరంపై దాడి చేసిన విషయం తెలిసిందే. పట్టుబడిన జూదరులపై గన్నవరం పోలీసులు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. పోలీస్‌స్టేషన్‌లోనే సోమవారం నిందితులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక బస్సులో 47 మందిని స్థానిక అదనపు జూనియర్ సివిల్ కోర్టులో జడ్జి ముందు హాజరుపరిచారు. అనంతరం జడ్జి ఆదేశాల మేరకు రూ.20 వేలు వ్యక్తిగత పూచికత్తుపై నిందితులకు కోర్టు బెయిల్‌పై పోలీసులు విడుదల చేశారు. ఈ కేసులో సుమారు రూ.10 లక్షల నగదు, 19 కార్లు, 32 బైక్‌లు, 58 కోడి పుంజులను పోలీసులు జప్తు చేశారు.

భక్తిశ్రద్ధలతో పూజలు



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: స్థానిక ప్రసిద్ధ అభయాంజనేయ స్వామి దేవస్థానంలో హనుమాన్ జన్మనక్షత్రం పూర్వభాద్రను పురస్కరించుకుని స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామివారిని వివిధ రకాల పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. దాత విష్ణువర్ధనరావు, వరలక్ష్మి దంపతుల సహకారంతో భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. దెందులూరు ఏఎంసీ చైర్మన్ అప్పన కనకదుర్గాప్రసాద్, ఆలయ పాలకమండలి చైర్మన్ నెరుసు భూషణం, ఈఓ కూచిపూడి శ్రీనివాస్, బీజేపీ నేత సీతారామాంజనేయ చౌదరి, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఆయిల్ లీక్‌తో వాహనదారుల ఇక్కట్లు



గోసాల వద్ద జాతీయ రహదారిపై పడిన ఆయిల్

పెనమలూరు: గోసాల గ్రామ పరిధిలో విజయవాడ- మచిలీపట్నం జాతీయ రహదారిపై ఆయిల్ పడటంతో పలువురు వాహనదారులు ప్రమాదానికి గురయ్యారు. గోసాల ఇస్లాంపేట వద్ద బందరు రోడ్డుపై వాహనం నుంచి ఆయిల్ లీక్ అయ్యి రోడ్డుపై పడింది. ఇది గమనించకుండా వాహనదారులు ఆయిల్‌పై వెళ్లటంతో అదుపుతప్పి కిందపడిపోయారు. ఈ ఘటనలో పలువురు గాయపడ్డారు. ఇది గమనించిన వైఎస్సార్ సీపీ నేత, 8వ వార్డు సభ్యుడు అఫీజ్‌పాషా ప్రమాదం జరగకుండా బారికేడ్లు అడ్డుగా పెట్టి, చెట్టు కొమ్మలు రోడ్డుపై వేశారు. ఆయిల్‌పై ఇసుక వేసి ప్రమాదాలు నివారించారు.